## సంస్మరించుకుందాం

# భారత విప్లవోద్యమ నాయకులు కా॥ చంద్ర పుల్లారెడ్డికి జోహార్లు



**కామ్రేడ్** చంద్ర పుల్లారెడ్డి 1918 సెప్టెంబరు ఒకటవ తేదీన కర్నూలు జిల్లా వెలుగోడులో రైతు కుటుంబంలో జన్మించాడు. కర్నూలులో హైస్కూలు విద్య, మద్రాస్ లయోలా కాలేజీలో ఇంటర్మీడియట్, గిండీ ఇంజనీరింగ్ కాలేజీ (మద్రాసు)లో ఇంజనీరింగ్ విద్య సాగించాడు. బ్రిటీష్ వ్యతిరేక జాతీయోద్యమంతో ప్రభావితుడయ్యి జాతీయోద్యమంలోకి దూకాడు.

1940లో నెహ్రూ అరెస్టుకి నిరసనగా సమ్మెను, సామ్రాజ్యవాద యుద్ధానికి నిరసనోద్యమాన్ని నిర్వహించిన విద్యార్థి నాయకులలో సి.పి. ఒకరు. ఆనాడు కమ్యూనిస్టు నాయకుడు మోహన్ కుమార్ మంగళం పరిచయంతో మార్క్సిజం – లెనినిజంను తన తాత్విక రాజకీయ దృక్పథంగా స్వీకరించాడు. ఇంజనీరింగ్ విద్యకు స్వస్తి పలక నిర్ణయించుకున్నాడు. దానికి తగినట్లుగానే జాతీయోద్యమ కార్యకలాపాలలోను, కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలలోను లోతుగా దిగబడిపోయాడు.

ఇంజనీరింగ్ కాలేజి నుంచి బహిష్కరణకు గురయ్యాడు. ఆ తర్వాత విద్యార్థి ఆర్గనైజర్గా పనిచేసేందుకు మదనపల్లి కాలేజీలో చేరేందుకు ప్రయత్నించాడు. మద్రాసులో ఆయన కార్యకలాపాలు తెలిసిన మదనపల్లి కాలేజీవారు చేర్చుకోలేదు. ఇక సరాసరి కర్నూలు జిల్లాలో పార్టీ ఆర్గనైజర్గా పని ప్రారంభించాడు. దాదాపుగా 1944 నుండి 1966 వరకూ జిల్లా కమిటీ కార్యదర్శిగానూ, రాష్ట్ర కమిటీ సభ్యుడిగానూ పనిచేశాడు.

తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట కాలంలో (1946–50) రహస్య జీవితంలో విప్లవ కార్యకలాపాలు సాగించాడు. 1952 మద్రాసు అసెంబ్లీకి నందికొట్కూరు నియోజకవర్గం నుంచి గెలుపొందాడు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలోనూ, తెలంగాణా సాయుధ పోరాటం సందర్భంగా 1950లోనూ, భారత్–చైనా సరిహద్దు వివాదం సందర్భంగా డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ కింద 1962లోనూ, అదే కారణాలతో 1964లోనూ అరెస్టయ్యాడు.

కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిజానికి, నయా రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ముందుభాగాన నిలిచాడు. నక్సల్బరి జోతేదార్ వ్యతిరేక రైతాంగ సాయుధ తిరుగుబాటు, శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ తిరుగుబాటుతో నయా రివిజనిజం నుంచి తెగదెంపులు చేసుకొని విప్లవకారులను ఆర్గనైజ్ చేయడంలో భాగస్వామి అయ్యాడు.

గ్రామీణ ప్రాంతాలలో విముక్తి స్థావరాల నిర్మాణ లక్ష్యంతో ఖమ్మం, వరంగల్ ఫారెస్టు ప్రాంతానికి వెళ్ళాడు. అడవి ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేకంగా ఇతర దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా విప్లవోద్యమాన్ని నిర్మించాడు. ప్రజాప్రతిఘటనా ఆత్మరక్షణా దళాలు నిర్మించాడు. మొక్కవోని దీక్షతో ప్రతిఘటనోద్యమాన్ని విస్తరింపజేసాడు.

అనేక రాజకీయ, సిద్ధాంత, ఆచరణాత్మక సమస్యలతో అనైక్యతకు గురయిన విప్లవోద్యమాన్ని ఒకే త్రాటిపైకి తేవడం కోసం తన వంతు కృషిచేశాడు. తీవ్రంగానూ, అత్యంత తీవ్రంగానూ విభేదించుకొన్న కామ్రేడ్స్ని కలవాలనీ, కలపాలనీ ఆవేదన చెందాడు; పరితపించాడు.

అదే కృషిలో వుండి అనారోగ్యాన్ని గూడ లెక్కచేయకుండా ప్రయాణాలు సాగించి 1984 నవంబరు 9న అమరుడయ్యాడు.

కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి ధన్యజీవి. బాల్యం నుంచి అనుకున్నది సాధించేవరకు విశ్రమించని పట్టుదల గల మనిషి. చేపట్టిన కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి ఎంతటి కష్టాలనైనా భరించిన యోధుడు. కామ్రేడ్ సి.పి. ఈ లక్షణాలు కమ్యూనిస్టు విప్లవకారులకు ఆదర్శనీయం.

*****